# హిజ్రా

'ఏరా... ఏం నడక అది... సరిగ్గా నడువ్' తండ్రి గదమాయించేసరికి కాళ్లల్లో వణుకు పుట్టింది సంజీవ్‌కి. కాళ్లు తడబడ్డాయి. కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

'ప్రతి దానికీ ఏడ్చి చస్తావెందుకు ఆడపిల్లలాగా... కళ్లల్లో ఆ నీళ్లేంటి?" ఉరిమాడు తండ్రి.

'అసలు వాడికన్నీ ఆడంగి వేషాలొస్తున్నాయ్... పొద్దంతా గదిలో కూచుంటాడు. లేదంటే అద్దంలో మొహం చూస్కుంటాడు. కాలేజీకి కూడా సరిగా వెళ్లటం లేదు నాన్నా..' సంజీవ్ అన్న రాకేష్ పిర్యాదు చేశాడు.

సంజీవ్ మరింత భయంగా ముడుచుకుపోయాడు.

'కాలేజీకి వెళ్లట్లేదా... అడుక్కుతింటావ్‌రా వెధవా... నా కడుపున చెడబుట్టినవ్... నువ్వు కాలేజీకి వెళ్లట్లేదని తెలిస్తే చంపేస్తాను...' హుంకరించి బయటికెళ్లిపోయాడు తండ్రి.

సంజీవ్‌కి దుఃఖం పొంగుకొచ్చింది.

తన గదిలోకి వెళ్లి తలుపేసుకొని ఏడ్చాడు... తన శరీరం వంక వింతగా, విచిత్రంగా చూసుకున్నాడు.

ధైర్యాన్ని కూడదెచ్చుకుని అడుగులేసినా... తన నడకలో తనకే ఏదో ఆడతనం కనపడుతోంది. కాలేజీలో తన నడక చూసే కదా... స్టూడెంట్స్ చేసే కామెంట్స్, మనసుకి గుండుసూదుల్లా గుచ్చుకొని గుండె విలవిల్లాడేది. కాలేజి అంటేనే భయం... భయం... ఆడపిల్లలు కూడా తనతో స్నేహం చేయడానికి ఎక్కువ ఇష్టపడుతూనే... తనపై వేసే జోక్స్‌తో మనసు చిన్నబోయేది. రోజురోజుకీ తనసందరూ వింతగా చూడటం తట్టుకోలేక పోతున్నాడు.

'సంజీవ్ అన్నం తిందువ్‌గానీ రారా...' అమ్మ వచ్చి పిలవటంతో కన్నీళ్లు తుడుచుకున్నాడు. తల్లి సంజీవ్ పక్కనే కూచొని లాలనగా 'నాన్న తిట్టాడని బాధపడకురా... ఆయన కోపిష్టి మనిషి, రాకేష్‌గాని, సంధ్యగానీ నీ మీద ఏమైనా నాన్నకి చెపితే బావుండదని వాళ్లకు చెప్తాను గానీ... అన్నం తిందువ్‌గానీ రా కన్నా...' అంది.

అమ్మ ప్రేమకి సంజీవ్ కరిగిపోయాడు. తల్లి ఒడిలో తలదాచుకొని బావురుమన్నాడు.

'ఏమైందిరా... నీకొచ్చిన బాధేంటి చెప్పు...' అంది ప్రేమగా.

తలెత్తి కళ్లలోకి చూశాడు. సంజీవ్ కళ్లలోని సంఘర్షణేంటో ఆ తల్లి మనసుకి కూడా అందలేదు.

'అమ్మా...' అన్నాడు బాధగా. ఆ పిలుపులో ఏదో చెప్పుకోవాలన్న తపన... చెబితే ఎక్కడ అసహ్యించుకుంటారోనన్న భయం సంజీవిని నరకయాతన పెడుతోంది.

'చెప్పరా... నీకేమవుతోంది... మేం అందరం వున్నాం కదా చెప్పు...' అంది ప్రేమగా.

'అమ్మా...'

గుండెలోని వేదన మాటలుగా రూపు దిద్దుకోవడానికి నాలుకే సహకరించటం లేదు.

మనసు ఘోషిస్తోంది...

'అమ్మా... నా శరీరంలో ఏదో మార్పులొస్తున్నాయి. చెల్లెలిగా మారి పోవాలన్పిస్తోంది...' అని చెప్పాలనుకున్నాడు. ఇంట్లో ఎవరికీ చెప్పుకోలేని వింత సమస్య తనదై... తల్లి కూడా తననెక్కడ అసహ్యించుకుంటుందోనన్న భయంతో చెప్పలేకపోయాడు. రోజురోజుకీ ఈ సంఘర్షణ పెరుగుతోంది. ఆడ, మగా తిరిగే సమాజంలో ఎటూ కాకుండా వీళ్ల మధ్య తాను చిత్రహింసల పాలుకాక తప్పదా...

దేవుడా... నా బతుకునెందుకిలా మారుస్తున్నావ్? పుట్టుకతోనే ఆడ పిల్లగా పుట్టించినా ఈ నరకం తప్పదేమో...

డాక్టర్ దగ్గరికెళ్లాలన్నా భయం...

అమ్మతో చెప్పుకోవాలన్నా భయం...

కాలేజీకెళ్ళాలన్నా భయం...

ఇన్ని భయాల మధ్య... తననో వింత జంతువుని చూసినట్టు రోజురోజుకీ చూపుల్తోనే చంపేస్తుంటే... ఎక్కడికో పారిపోవాలనుంది... తన ప్రపంచం ఇది కాదు అనే భావం అనుక్షణం తొలిచేస్తుంది... వీళ్లెవరూ తన వాళ్లు కాదు అనే అభిప్రాయం బలపడిపోయింది... వీటన్నింటి కన్న 'చచ్చిపోవటం' నయమనిపిస్తోంది... తన వల్ల ఎవరికీ తలవంపులు రాకుండా చచ్చిపోవాలన్పిస్తుంది..

ఈ రాత్రికే చచ్చిపోవాలి... చనిపోయే ముందు ఒక్కసారి చెల్లెల్లాగా అలంకరించుకోవాలి... అద్దంలో నింపాదిగా చూసుకోవాలి.. రోజురోజుకీ పెరుగుతున్న బలీయమైన కోరిక... ఆడవాళ్లలా అలంకరించుకోవాలి.

ఈ రాత్రే ఆ కోరిక తీర్చుకోవాలి...

ఆ ఆలోచన రాగానే సంజీవి మనసు తేలికైపోయింది.

❀ ❀ ❀

రాత్రి... ఒంటిగంట దాటుతోంది.

సంజీవి మంచం మీది నించి లేచాడు. అందరూ గాఢ నిద్రలో వున్నారని నిర్ధారించుకొని నిశ్శబ్దంగా తన చెల్లెలి గదిలోకి వెళ్లి లైటేశాడు. అల్మరా నిండా అందమైన పంజాబీ డ్రెస్సుల్ని చూడగానే కళ్లు విప్పారాయి. వాటిని ప్రేమగా తడిమి చూసి ఎరుపు రంగులో వున్న డ్రెస్సు తీశాడు. తలుపు దగ్గరగా వేసి వచ్చి పంజాబీ డ్రెస్ వేసుకున్నాడు. డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరికి వెళ్లి తనని తాను చూసుకొని మురిసిపోయాడు. దువ్వెనతో వెంట్రుకల్లో పాపిట తీసి చెల్లెలు పెట్టుకొనే హెయిర్ బాండ్ తీసి పెట్టుకున్నాడు. చమ్కీల బొట్టుబిళ్ల పెట్టుకొని లిప్‌స్టిక్ రాసుకున్నాడు. ఐ పెన్సిల్‌తో కళ్లని దిద్దుకున్నాడు.

అద్దంలో తన అందాన్ని వివిధ భంగిమలలో చూసుకొని ఆశ్చర్యపోయాడు. మనసు నిండా ఆనందం... ఉద్వేగం కలగలసి వచ్చాయి. ఆ రూపం చూసుకున్నాక చావాలన్పించలేదు... ఇలాగే... ఇంకా ఇంకా బతకాలన్పించింది...

అద్దంలో తన ప్రతిబింబాన్ని ముద్దు పెట్టుకోబోయిన వాడల్లా... తలుపు దగ్గర అలికిడి కావటంతో ఉలిక్కిపడి తిరిగి చూశాడు. కళ్లలోంచి చండ్ర నిప్పులు కక్కుతూ అక్కడ తండ్రి నిల్చున్నాడు. తండ్రిని చూడగానే సంజీవ్ నిలువెల్లా వణికిపోయాడు.

'ఒరేయ్... పిచ్చి గాడిదకొడకా...' తండ్రి అరుపుకి అంతా నిద్రలేచారు. క్షణంలో ఇంట్లో లైట్లన్నీ వెలిగాయి. సంజీవ్ రూపం చూసి అందరూ చలించిపోయారు... కోపం, ఆవేదన కలగలిసి వచ్చాయి. ఆ గదిలో మూలగా వున్న బలమైన కర్రని తీసుకొని సంజీవ్‌ని చితకబాదాడు తండ్రి. అరుపులు, పెడబొబ్బలతో ఇల్లంతా కదిలిపోయింది. సంజీవ్ శరీరం మీద వాతలు తేలాయి. ఎవరూ ఆపే ప్రయత్నం చేయలేదు. అసహాయులై చూస్తుండిపోయారు. తల్లీ, చెల్లి, అన్నయ్య అందరూ ఏడ్చారు. దెబ్బలు తిని ఓ మూలగా నక్కి ఏడుస్తున్న సంజీవ్‌ని చూడగానే తండ్రిలో సైతం దుఃఖం పొంగుకొచ్చింది... భార్యతో భారంగా అన్నాడు. 'వీడిలా ఎందుకు మారిపోతున్నాడు. మన పరువేమై పోవాలి... ఇంట్లో ఓ కొజ్జా గాడున్నాడంటే ఎంత అసహ్యంగా ఉంటుందే...'

తల్లి కూడా సంజీవిని పట్టుకొని ఏడుస్తూ అడిగింది.

'నీకేమైందిరా... ఇలా ఎందుకు మారిపోతున్నావ్. ఈ డ్రెస్సేమిటి? ఆడ పిల్లలా ఈ అలంకారాలేమిటి?'

సంజీవి ఏమీ మాట్లాడలేదు. నొప్పుల్తో లేవలేక భారంగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

లైట్లు ఆర్పేసుకొని... ఆ రాత్రి ఎవరూ నిద్రపోలేదు.

తెల్లారేసరికల్లా....

సంజీవ్ తన గదిలో లేదు... మరో సారి ఇల్లంతా బావురుమంది.

❀ ❀ ❀

హిజ్రోంకా అలావా!!

ఆ చవకబారు అపార్ట్‌మెంట్‌లో అంతా సందడిగా ఉంది. అంతా వేషధారణలో ఆడవాళ్ళలాగే ఉన్నారు కాని... వాళ్ల శరీరాల్లో కాఠిన్యం, మగరూపం కొట్టొచ్చినట్టుగా కన్పడుతోంది. పట్టుచీరెలు, కట్టుకొని, ఆభరణాలు పెట్టుకున్నారు.

ఓ మార్వాడి సేట్ ఇంటికి, ఆయన మనవడి బారసాలకి 'డోలక్'కి వెళ్తున్నారు. సంజీవిని తీసుకొచ్చిన వ్యక్తిని చూసి ఒక్కసారిగా ఆనందంతో చుట్టుముట్టారు. 'సూర్యం బావా... ఎన్ని రోజులకొచ్చావ్?" అంటూ సంజీవి వైపు కూడా ఆప్యాయంగా చూశారు. ప్రేమగా బుగ్గ గిల్లారు. సంజీవి మనసు మొదటిసారి ఆనందంగా ఊగిసలాడింది. ఆ అనురాగాలకి కరిగిపోయాడు. తన ప్రపంచం ఇదే అన్పించింది. సూర్యం అనే వ్యక్తి చిరాగ్గా వాళ్లని తప్పుకుంటూనే 'అత్త లేదా? ఎక్కడా?" అన్నాడు. ఇంతలో నడి వయసు హిజ్రా ఎదురొచ్చింది. 'సూర్యం బావున్నావా?' అంటూనే సంజీవిని పరిశీలనగా చూసింది.

'ఈ కుర్రాడు ట్రెయిన్‌లో పరిచయమయ్యాడు. లక్షణాలు గమనించి నీ దగ్గరికి తీసుకొచ్చాను' అని సింపుల్‌గా అప్పజెప్పాడు. 'అత్త' సూర్యంకి వెయ్యి రూపాయలిచ్చింది. సూర్యం వెళ్లిపోయాడు. పుట్టిన పిల్లవాడి భవిష్యత్తు తమ జీవితంలా కాకూడదని ఆటపాటల్తో ప్రార్థించే డోలక్ కోసం హిజ్రాలు కూడా వెళ్లిపోవటంతో అక్కడ కోలాహలం కూడా తగ్గింది. అత్త సంజీవి భుజమ్మీద చెయ్యేసి తన గదిలోకి తీసుకెళ్లింది. చాలా ఖరీదైన వస్తువులతో అలంకరించబడిన ఆ గదిలో ఏసీ చల్లదనానికి, సంజీవి ప్రాణం లేచి వచ్చింది. ఆ అపార్ట్‌మెంట్‌లో ఆ గది మాత్రమే ఖరీదైనదిగా కన్పడుతోంది. 'ముందు స్నానం చేసి నీకిష్టమైన దుస్తులు వేసుకొని భోజనం చేయి. తర్వాత నువ్వు మాలో ఒకడిగా కల్సిపోవాలంటే... మేం చెప్పినట్లల్లా నడుచుకోవాలి. సాయంత్రం కారు రాగానే నిన్నో వ్యక్తి దగ్గరికి పంపిస్తాను. సరేనా' అంది.

సంజీవి తలూపాడు.

సాయంత్రానికల్లా ఓ కారు రాగానే దాంట్లో ఎక్కించి పంపించింది. ఆ కారు ఓ గెస్ట్‌హౌస్‌కి వెళ్లింది. అక్కడ ఓ ఖరీదైన వ్యక్తి సంజీవ్‌ని గదిలోకి తీసుకెళ్లాడు. అతడు మొదలు పెట్టిన లైంగిక హింసతో అతడు హోమో అని అర్థం అయింది.

ఆడపిల్లగా మారాలనే భావన పెరిగి పెరిగి... ఎంతటి నరకానికి దారులు వేసిందో తెలిసి సంజీవి వణికిపోయాడు... అతడవేమీ పట్టించుకోకుండా లైంగికంగా హింసించాడు. ఐదువేలు చేతిలో పెట్టి పంపించాడు.

ఆ డబ్బు తీసుకొని 'అత్త' చెప్పింది.

'రేపుగాని... ఎల్లుండి గాని ఆపరేషన్ చేయిస్తాను'

'ఆపరేషన్ దేనికి?' సంజీవి అయోమయంగా అడిగాడు.

అత్త బిగ్గరగా నవ్వింది.

'ఇంత అమాయకురాలివి ఎలా బతుకుతావ్? రూపం మారాక అవశేషంగా మిగిలే అవయవాలెందుకు?'

అత్త మాటలు విన్న సంజీవికి చెమటలు పట్టాయి. ఆడపిల్లగా మారితే అనే భావం వెనుక ఎంత భయంకరమైన ప్రపంచం ఉందో కన్పిస్తుంది. 'మళ్లీ పారిపోతే?' అనుకున్నాడు. సంజీవి ఆలోచనల్ని పసిగట్టిన అత్త 'నువ్విక్కణ్నించి ఎప్పుడూ తప్పించుకోలేవు' అని వెళ్లిపోయింది.

మర్నాడు సంజీవికి ఆపరేషన్ జరిగింది.

హిజ్రాలంతా పండుగ జరిపారు. తలంటు స్నానం చేసి కొత్తచీర కట్టి, పూలుపండ్లతో సత్కరించారు. అందరి సమక్షంలో సంజీవిని అత్త 'హిజ్రా'గా ప్రకటించింది. సంజీవి పేరు 'రేవతి'గా మార్చింది.

అదే రోజు రాత్రి అవాలాపై పోలీసులు దాడి చేశారు. పట్టణంలో ముగ్గురు పిల్లలు మాయమయ్యారన్న నెపంతో పోలీసులు వీరంగం చేశారు. వారిపట్ల అసభ్యంగా మాట్లాడుతూ... కొందర్ని స్టేషన్‌కి లాక్కెళ్లారు. రేవతి (సంజీవి)కి ఈ అనుభవం మరో అనుకోని దెబ్బగా మారింది.

పోలీస్‌స్టేషన్ బయట నిల్చున్నప్పుడు కొందరు పోకిరీలు కన్నుగొట్టి వెకిలిగా ప్రవర్తించినా పోలీసులు కూడా ఎంజాయ్ చేశారే తప్ప వాళ్లనేమి అన్లేదు. అదే రేవతిలో కోపం తెప్పించింది.

'హిజ్రాల్ని మనుషులుగా చూడండి... మాకూ చీము నెత్తురూ వున్నాయి' అంది.

'అవి రెండే వున్నాయి... ఇంకేం వున్నాయ్' ఓ కానిస్టేబుల్ తన జోక్‌కి తానే బిగ్గరగా నవ్వాడు.

'మీ ముందే బయటి పోకిరీలు అల్లరి చేస్తుంటే మీరేమి పట్టనట్టు కూచున్నారు' అంది కోపంగా.

'వాళ్లు కాలేజి అమ్మాయిల్నే టీజ్ చేసే బాపతు. మీరెంత?' అన్నాడో పోలీస్.

'అంటే మేం మనుషులం కాదా? మీరున్నదెందుకు... మా దగ్గర మామూళ్లు పుచ్చుకునేటప్పుడు మాత్రం ఇవేం గుర్తుకు రావు...' అని గొణిగింది.

'ఏంట్రా... కొజ్జా నా కొడుకా...' అనబోయిన కానిస్టేబుల్ ఎస్సై రావటం చూసి సైలెంటయిపోయాడు.

ఇలాంటి అనేకానేక సంఘటనల్తో వాళ్లల్లో అవమానం స్థానంలో తెగింపు వచ్చేసింది. బాధపడటం మానుకొని ఎదురుతిరిగి దాడి చేసే స్థితికి చేరుకున్నారు.

మర్నాడు... తన 'ఇలాకా'లోకి వచ్చి మామూళ్లు వసూలు చేసిన ఒకడికి గుండు గీసి... లైంగికంగా వేధించి పంపించారు. రేవతికి అది నచ్చింది. తమలోని కసిని ఇలా తీర్చుకుంటారనుకుంది. చదువు నేర్పమని రేవతిని ప్రాధేయపడి నేర్చుకునేవారు. చదువుతో రేవతికి గుర్తింపు, గౌరవం లభించాయి. రేవతిలోని నాయకత్వ లక్షణాలు చూసి అత్త సిటీలోని ఒక ఏరియాని 'ఇలాకా'గా రేవతికిచ్చేసింది. ఆ ఏరియాలోని ఇలాకాతో నెలకి మూడు లక్షల పైనే కొజ్జాల సంపాదన ఉంటుంది. అప్పటికే ఏడాదిన్నర గడిచిపోయింది. రేవతి చుట్టూ ఇప్పుడు విలాసవంతమైన జీవితం మొదలైంది. అయినా అప్పుడప్పుడు చప్పున అమ్మా, నాన్న, అన్నా చెల్లి అందరూ గుర్తొచ్చేవారు. మనసు బేలగా మూగబోయేది.

అమ్మా...

నా నుంచి ఉత్తరం వస్తుందని ఊహించి వుండవ్... నేను ఇంట్లోంచి వెళ్లిపోయి రెండేళ్లవుతోంది ఈ రోజుకి. అందుకే ఈ రోజు నాకు బాగా గుర్తుంటుంది. ఎలా వున్నారమ్మా?.. నాన్న, అన్నయ్య, చెల్లీ అందరూ బాగున్నారా? అమ్మా... నా పేరిప్పుడు రేవతి... సంజీవి అని పెట్టినప్పుడు ఇలా మారిపోతానని వూహించలేదు కదూ... ఇప్పుడు నేను ఓ 'ఇలాకా'కి సామ్రాజ్ఞిని, పన్నెండు హిజ్రాల బృందాలకి నేనే అత్తని.. అమ్మా... 'అత్త' అంటే ఇక్కడ అమ్మకన్నా గొప్ప స్థానం ఉంది. నేనిప్పుడు ఆ స్థానంలో వున్నాను. మీ దగ్గర భర్త చనిపోతే భార్య వైధవ్యాన్ని స్వీకరించినట్లే... ఇక్కడ అత్త చనిపోతే ఆశ్రితులందరూ పసుపు కుంకుమలు తీసేసి వైధవ్యాన్ని స్వీకరిస్తారు.

నామకరణం, అన్నప్రాసన, పెళ్లిళ్లు, షాపుల ప్రారంభోత్సవానికి శుభ సూచకంగా మేమే డోలక్‌లు నిర్వహిస్తాం. అమ్మా... ఇప్పుడు నాకు స్వంత బంగ్లా, రెండు కార్లు వున్నాయి... అలాగని ఇదేదో గొప్ప జీవితమని నేనెప్పుడూ చెప్పను. నన్ను చేరదీసిన అత్త ఎయిడ్స్ వ్యాధితో భయంకరమైన జీవితం గడిపి చనిపోయింది.

ఎందుకంటే... మాకు మందులివ్వడానికి డాక్టర్లు కూడా ముందుకు రారు... ఏ బయటి వ్యక్తీ మాతో మనసు విప్పి మాట్లాడదు... మేమొక శాపగ్రస్తులం...

వైతరణీ నదికన్నా హీనంగా... కుళ్లిపోయిన కళేబరం మీద మొలిచిన శిలీంధ్రంలా చూస్తారే తప్ప... మా కనురెప్పల కింద ఊగిసలాడే కన్నీటి బొట్టులో చిట్లిపోతున్న సముద్రాల్ని ఎవరు చూశారని? అందుకే మాలో అనాథలుగా చనిపోయే వాళ్లే ఎక్కువ... పుట్టినప్పుడే హార్మోన్ల లోపాల్ని సరిచేసి వుంటే మాకీ దుర్భర జీవితముండేదా... మమ్మల్ని 'తృతీయ ప్రకృతి'గా మారుస్తుందెవరు?? అనాది నించీ వంటగాళ్లుగా, బిచ్చగాళ్లుగా, సెక్స్ వర్కర్లుగా మిగిలిపోయిన కొజ్జాలు తమ అస్తిత్వాన్ని గుర్తించమని ఇప్పుడు ఏకమవుతున్నారు. చదువులు నేర్చి, సంఘాలు పెట్టి చివరికి దేశంలో ఓ చోట ఎమ్మెల్యే సీటుని కూడా గెలుచుకోగలిగాం. అప్పుడు ప్రపంచం నోరెళ్లబెట్టింది. పోనీలే... ఆవిషయాలన్నీ మీకు నచ్చవు... ఎందుకో అందరూ గుర్తొస్తున్నారు... మొదటిసారి ఉత్తరం రాయాలన్పించింది. మీ గుండెల్లో నాకింకా ఆవగింజయినా చోటుంటే అసహ్యించుకోకండి. రిప్లై రాయండి. జీవితకాలం దాన్ని దాచిపెట్టుకుంటాను.

ఎదురుచూస్తూ... మీ

సంజీవి (రేవతి)

ఉత్తరాన్ని పోస్ట్ చేసిన రేవతి నిజానికి రిప్లైని ఆశించలేదు. కానీ నాల్రోజుల్లోనే

రిప్లై రావటంతో సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయింది. కవర్ చించగానే చెల్లెలి పెళ్లి పత్రిక చదివి మరింత ఆనందంగా అందర్నీ పిలిచింది. చెల్లెలి పెళ్లికి వెళ్లాలని అక్కడ పెద్ద ఎత్తున 'డోలక్' నిర్వహించాలని అందరికీ స్వీట్లు పంచింది.

ఆ తర్వాత వెడ్డింగ్ కార్డుతో పాటు వున్న ఉత్తరాన్ని తీసి చదివింది.

'ప్రియమైన సంజీవ్...

నీ అన్నయ్య రాయునది, నువ్వలా వెళ్లిపోవటంతో అందరం బాధపడ్డాం. ఈ నెల పదిహేనున చెల్లెలి పెళ్లి. అబ్బాయి ఇంజనీరు. కట్నం డబ్బుల కోసం అందరం కష్టపడుతున్నాం. నువ్వు ఇప్పుడు ధనవంతుడివి అని తెల్సి అంతా సంతోషించాం. చెల్లెలి పెళ్లి కోసం రెండు లక్షల రూపాయలు పంపగలవు. ఎలాగైనా డబ్బు పంపించు... చివరగా ఒక మాట... దయచేసి నువ్వు పెళ్లికి రావద్దు. ఎందుకంటే మనది పరువు గల కుటుంబం...నిన్ను అలా చూస్తే చెల్లెలి పెళ్లి ఏమైనా కావచ్చు. దయచేసి రావద్దని నాన్న చెప్పాడు. నువ్వు పంపించే డబ్బు కోసం ఎదురు చూస్తాం.

– రాకేష్,

ఉత్తరం చదివి రేవతి కుంగిపోయింది. ఒక్కసారి తన వాళ్లందర్ని చూడాలన్న ఆశ పిడికిట్లోని మంచుగడ్డలా కరిగిపోయింది. గుండె మొద్దుబారిపోయింది. అయినా తమాయించుకొని... సంతోషంగా రెండు లక్షల రూపాయల చెక్కు కొరియర్ ద్వారా పంపించింది.

❀ ❀ ❀

మర్నాడు సాయంత్రం....

భోపాల్ నించి కొంతమంది పెద్ద మనుషులొచ్చారు. రేవతికి తమ గోడు చెప్పుకున్నారు.

'పంటలు చేతికందేలా లేవు. చెరువులన్నీ ఎండిపోయాయి. వాగులు వంకలు ఇసుక మేటలై పోయాయి. తాగడానిక్కూడ గుక్కెడు నీళ్లు కరువయ్యాయి. వానదేవుడి కోసం చెయ్యని పూజలు లేవు. రోకలి బండకి కప్పని కట్టి ఊరేగించాం. అయినా ఫలితం లేదు. వరుణుడు కరుణించలేదు. మీరంతా రావాలి. 'భుజారియా' వేడుకలు జరపాలి... వర్షం పడితే ఇరవై వేలిస్తాం. ఇప్పుడు అయిదువేలు అడ్వాన్స్‌గా ఉంచండి' వచ్చిన పెద్దమనుషులంతా ఇవే మాటల్ని తిరిగి తిరిగి చెప్పారు. రేవతిని బతిమాలారు... చివరికి ఒప్పుకుంది. అడ్వాన్స్ ఇవ్వబోతుంటే... 'డబ్బు వద్దు. జనం కోసమే కదా చేసేది. అదీ నీళ్ల కోసం... దానిక్కూడా డబ్బు తీసుకుంటే నీచంగా ఉంటుంది. మా వాళ్లు కూడా

ఒప్పుకోరు. కాకపోతే మా భుజారియా వేడుకల్లో వానదేవుడు కరుణిస్తాడని, వర్షం పడుతుందని మాట మాత్రం ఇవ్వలేను. మా ప్రయత్నం చేస్తాం...' అంది.

'మీ సంగీతానికి, నాట్యానికి వానదేవుడు కరుణిస్తాడు. మీరు తప్పక రావాలి. లేదంటే నీటిచుక్క దొరక్క చచ్చిపోతాం...'

'నీళ్లకోసం కాబట్టి మా వాళ్లు కూడా ఒప్పుకుంటారు. రేపు బయల్దేరతాం. ఎల్లుండే భుజారియా...' అంది.

వాళ్లంతా సెలవు తీసుకున్నారు.

❀ ❀ ❀

మధ్యాహ్నం...ఎర్రటి ఎండ... చంద్రనిప్పులు కక్కుతోంది. గాలిలో తడారిపోయి... నిప్పుల కుంపటి ఆవిర్లు కక్కుతున్నట్లుగా ఉందా వాతావరణం.

దాదాపు మూడు వేల మంది 'భుజారియా' చూడ్డానికి వచ్చారు. అరవై మంది హిజ్రాల వాయిద్యాలతో, డ్యాన్సులతో ఆ ప్రాంతం మార్మోగుతోంది. అప్పటికే రెండు గంటల్నించి నృత్యాలు చేస్తూ చెమటలు కక్కుతున్నారు. చుట్టూ చూస్తున్న జనం హుషారుగా వెర్రెక్కిస్తూ ఈలలు వేస్తున్నారు. అప్పుడప్పుడూ ఆకాశంవైపు ఆశగా చూస్తున్నారు.

బూజు పట్టినట్టు తెల్లమబ్బుల్తో ఆకాశం... మరో రెండు గంటలు గడిచాయి. వాయిద్యాల హోరు, నృత్యం తారాస్థాయికి చేరుకుంటున్నాయి. బంగాళాఖాతంలో లేచిన అల్పపీడనమో లేక హిజ్రాల నృత్య ఫలితమో గాని...

ఆకాశంలో ఒక నల్లమబ్బు భుగభుగమంటూ కదిలిపోయింది.

అది చూడగానే మూడువేల జనం హోరెత్తిపోయారు. ఆడి అలసిపోతున్న హిజ్రాల్ని కేకల్తో ఉత్తేజపరిచారు. తూరుపు దిక్కున ఒక మెరుపు చరచరా పాకిపోయింది. అరుపులు, కేకలు, వాయిద్యాలు, డ్యాన్సులతో ఆ ప్రాంతం దద్దరిల్లి పోతోంది. ఆకాశంలోకి పరిగెత్తుకొస్తున్న నల్లమబ్బులు... క్రమంగా నీడ పరచుకుంటున్నట్టు... చల్లదనం... ఉరుములు... మొదటి చినుకు టప్పున రేవతి మీద పడింది. వాన దేవుడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొని హుషారు తెచ్చుకొని ఆడింది.

టప....టప...టప...టప...టప...

చినుకులు... చినుకులు...

జనం ఆనందంగా నోళ్లు తెరిచారు. దోసిళ్లలో చినుకుల్ని పట్టుకొని చిన్న పిల్లల్లా కేరింతలు కొట్టారు....

హోరున వర్షం మొదలైంది. జలధారలు పడ్డాయి... హోలీ పండుగలా డ్యాన్సులు మొదలెట్టారు. జనం ఆనందంగా హిజ్రాల్ని గాల్లోకి ఎగరేశారు.

కె.వి.నరేందర్

అక్కడే... పట్టుతప్పి రేవతి కింద పడిపోయింది. లేవడానికి ప్రయత్నించేలోగానే... కొన్ని పాదాలు బలంగా మీద పడ్డాయి. ఆ అరుపుల హోరులో ఆమె ఆర్తనాదం ఎవరికీ విన్పించలేదు.

వందల ఇనుప పాదాలు... కర్కశంగా తొక్కేస్తున్నాయి... కడుపులో పేగులు చిట్లిపోయి.... నోటి ద్వారా వచ్చిన రక్తం... వర్షపు ధారలో కల్సిపోతోంది....

శరీరంలోని ఎముకలు నుజ్జునుజ్జయ్యాయి....

'అమ్మా...' అన్న మూలుగు సైతం ఆగిపోయింది. రేవతి ప్రాణం నీళ్లల్లో కల్సిపోయింది. వర్షం ఎక్కువవటంతో రైతులు పొలాల వైపు, మిగతా వాళ్లు ఇళ్లల్లోకి పరిగెత్తారు. అంతా నిర్మానుష్యం...

వర్షపు నీటిలో రేవతి శవం... హృదయవిదారకంగా... దిక్కులేకుండా పడి ఉంది. ఒకరిద్దరు గమనించి దగ్గరగా వచ్చినా 'చెక్కాగాడి శవంలే' అనుకొని వెళ్లిపోయారు. వర్షం కుండపోతగా పడుతూనే ఉంది...

మర్నాడు... దినపత్రికల్లో ఓ మూలన చిన్న వార్త పడింది.

'తొక్కిసలాటలో ఓ కొజ్జా మృతి'.